క్లుప్తంగా

రేపల్లెలో అమర వీరుల స్మారక సభ రేపు

భట్టిప్రోలు: సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం రేపల్లెలోని నెహ్రూ బొమ్మ వద్ద పాత రేపల్లె తాలూకా కమ్యూనిస్ట్ ఉద్యమంలో ప్రాణాలు విడిచిన అమర వీరుల స్మారక సభ నిర్వహించనున్నట్లు మండల కార్యదర్శి జి.సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా సీపీఎం రాష్ట్ర, జిల్లా ప్రజా నాట్య మండలి నాయకులు వి. శ్రీనివాసరావు, డి.రమాదేవి, సీహెచ్ గంగయ్య, టి.కృష్ణమోహన్, ఎస్.అనిల్ కుమార్ పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలి

ఐలవరం(భట్టిప్రోలు): నేడు చిన్నారులు, బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాల నేపథ్యంలో గుడ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించాలని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి పేర్కొన్నారు. మండలంలోని ఐలవరం జిల్లా పరిషత్ హై స్కూల్‌లో పీహెచ్‌సీ వైద్యులు ఎ.శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం కన్వర్‌జెన్సీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ లలిత కుమారి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులు, విద్యార్థులకు పౌష్టికాహారం అందేలా చూడాలని కోరారు. రక్తహీనత ఉన్న వారిని గుర్తించి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి మెరుగైన వైద్యం అందేలా చూడాలన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది కిశోర బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రతపై పలు సూచనలు చేశారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, ఎంపీటీసీ మురుగుడు శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు కాటూరి లక్ష్మీన్నారాయణ, సీహెచ్‌వో డి. మాతయ్య వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చందోలులో ఘనంగా హరిద్ర శృంగార్చన



పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం 45వ హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి మాట్లాడుతూ చందోలు గ్రామంలోని బగళాముఖి అమ్మవారి దేవాలయంలో ప్రతి శుక్రవారం వివాహం కాని మగ పిల్లలకు శీఘ్రముగా వివాహం జరుగుటకు ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

అచ్యుతాష్టకం కంఠస్థ పఠనంలో విద్యార్థి ప్రతిభ



భట్టిప్రోలు: గుంటూరులోని టీటీడీ కల్యాణ మండపంలో గురువారం నిర్వహించిన అచ్యుతాష్టకం కంఠస్థ పఠన పోటీలలో భట్టిప్రోలు విద్యార్థి సత్తా చాటాడు. తిరుమల తిరుపతి దేవస్థానములు(టీటీడీ) హిందూ ధర్మ ప్రచార పరిషత్ (హెచ్‌డీపీపీ) సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. భట్టిప్రోలు మాతా ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో 5వ తరగతి విద్యార్థి సుంకర దేవరాజ్ ప్రథమ స్థానం సాధించాడు. రామాయణం, మహాభారతంకు సంబంధించిన మూడు గ్రంథాలను నిర్వాహకులు దేవరాజ్‌కు బహూకరించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కీసర పార్థసారథి శర్మ, బూర్లె అరుణ కుమారి, నందిపాటి తులసి వ్యవహరించారు. టీటీడీ, హెచ్‌డీపీపీ ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహకురాలు ఇ. అమ్మడు పోటీలను పర్యవేక్షించారు. శుక్రవారం హైస్కూల్‌లో దేవరాజ్‌ను ప్రిన్సిపల్ కొత్తా రవితేజ, ఉపాధ్యాయులు చౌడవరపు అరుణ, కౌతరపు సృజన్న, దీపిక, హేమలత, శివాని అభినందించారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

కొల్లూరు: వ్యసనాలకు బానిసై భార్యను అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్తపై కొల్లూరు పోలీసు స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని ఆవులవారిపాలేనికి చెందిన విప్పర్ల ప్రియాంకకు రెండేళ్ల క్రితం భట్టిప్రోలు మండలం కోళ్లపాలేనికి చెందిన బుస్సా వాసుతో వివాహం జరిగింది. ఈ క్రమంలో వాసు వ్యసనాలకు బానిసై శారీరకంగా, మానసికంగా వేధింపులకు పాల్పడటంతో పాటు, అదనంగా కట్నం తీసుకురావాలని ఒత్తిడికి గురిచేస్తున్నాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. వేధింపులు అధికమవడంతో పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శామ్యూల్ రాజీవ్‌కుమార్ తెలిపారు.

ప్రతి కుటుంబానికీ.. సంక్షేమ పథకాల లబ్ధి

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి మేరుగ నాగార్జున



మోపర్రు గ్రామంలో మహిళలతో మాట్లాడుతున్న మంత్రి మేరుగ నాగార్జున

మోపర్రు(వేమూరు): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. అమర్తలూరు మండలంలోని మోపర్రు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం జరిగింది. గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు మంత్రి మేరుగ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను కులం, మతం, పార్టీలకు అతీతకంగా పేదలందరికీ అందేలా అమలు చేస్తున్నారని కొనియాడారు. భట్టిప్రోలు మండలంలోని పెదపులివర్రు గ్రామానికి చెందిన దర్శకుడు, కళా తపస్వి కె.విశ్వనాథ్ మృతి నియోజకవర్గ ప్రజలకు తీరని లోటు అని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాపర్ల నరేంద్ర, గ్రామ సర్పంచ్ కొండపల్లి కిరణ్ బాబు, చందోలు డేవిడ్ విజయకుమార్, మార్కెట్ యార్డు చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, మోదుకూరి రవి కుమార్, కొండపల్లి వినయ్, కొత్తపల్లి శేషయ్య, షేక్ వలీ, కాకర్లమూడి భాస్కర్, కాకి సందీప్, కొండపల్లి వెంకట్, మోపర్తి విజయ కుమార్, చక్రవరం గోవిందరాజు, గర్నిపూడి అజయ్, జి.రామకృష్ణ, మన్నవ శాంత్రి శ్రీ, ఎం.బాలు, గోవతాటి ఏసోబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కళా తపస్వికి ఘన నివాళి



కె.విశ్వనాథ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ తదితరులు

భట్టిప్రోలు: తెలుగు సినిమా ఖ్యాతిని ఖండాంతరాలకు వ్యాపింపజేసిన కళా తపస్వి కె.విశ్వనాథ్ మరణం తీరని లోటని భట్టిప్రోలు ఎంపీపీ వెంకట లలితకుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు. విశ్వనాథ్ చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. మండలంలోని పెదపులివర్రు గ్రామానికి చెందిన విశ్వనాథ్ గురించి తెలుసుకుని ఎంపీటీసీగా తమ గ్రామం తరఫున ప్రాతినిధ్యం వహించినట్లు తెలిపారు. ఉద్దండులైన ఘంటసాల వెంకటేశ్వరరావు తమ ఊరి అల్లుడేనని, విశ్వనాథ్ బాల్యం ఇక్కడే గడిచిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు, ఏపీఎం కొండూరి శోభన్, పంచాయతీ రాజ్ ఏఈ సేతు రామచంద్రరావు, ఏపీ వడ్రంగి అసోసియేషన్ వేమూరు నియోజకవర్గ అధ్యక్షుడు కోడూరు వెంకటేశ్వరరావు, ఈఓపీఆర్డీ సీహెచ్ శేఖర్, సూపరింటెండెంట్ సీహెచ్ జలజ తదితరులు పాల్గొన్నారు.

'కత్తి'లాంటి క్రీడాకారులకు అభినందన



క్రీడాకారులను అభినందించిన తహసీల్దార్ కేశవ నారాయణరావు

కర్లపాలెం: ఇటీవల రాష్ట్రస్థాయిలో జరిగిన ఫెన్సింగ్(కత్తిసాము) పోటీల్లో బంగారు, కాంస్య పతకాలు సాధించిన చింతాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులను తహసీల్దార్ జి.కేశనారాయణరావు శుక్రవారం అభినందించారు. జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించాలని తన కార్యాలయంలో కలిసిన విద్యార్థులను ఆయన ప్రోత్సహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం డి.శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.గోపీ తహసీల్దార్‌తో మాట్లాడారు. గత నెల 26 నుంచి 1వ తేదీ వరకు కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి కత్తిసాము పోటీల్లో ఆరుగురు క్రీడాకారులు బంగారు పతకాలు, మరో ఆరుగురు కాంస్యం, ఎనిమిది మంది రజిత పతకాలు సాధించినట్లు తెలిపారు. క్రీడాకారుడు ఎస్కే రెహ్మాన్ రాష్ట్రస్థాయి బెస్ట్ షూటర్‌గా నిలిచి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడని, క్రీడాకారిని ఎస్కే జాస్మిన్ ఇంటర్నేషనల్ సాంస్కృతిక పోటీల్లో పాల్గొని ప్రశంసా పత్రం అందుకుందని చెప్పారు.

నేడు మల్లికార్జునేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం



అడవుల దీవిలో శ్రీ మల్లికార్జునేశ్వర స్వామి ఆలయం

నిజాంపట్నం: భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారం. ప్రసిద్ధి చెందిన శ్రీ భ్రమరీ బాలా త్రిపుర సుందరీ సహిత శ్రీ మల్లికార్జునేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు నిజాంపట్నం మండలంలోని అడవులదీవి సిద్ధమైంది. ఏటా అంగరంగ వైభవంగా ఈ ఆలయ ఉత్సవాలు జరుగుతాయి. ఎంతో విశిష్టత కలిగిన ఆలయాన్ని యల్లాప్రగడ వెంకట చలమయ్య, మంగమ్మ దంపతులు 1928లో నిర్మించారు. సుమారు 93 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయంలో శనివారం స్వామివారి కల్యాణాన్ని పురస్కరించుకుని తిరునాళ్లు వైభవంగా జరుగనున్నాయి. ఇప్పటికే ఆలయాన్ని వర్ణ రంజితంగా తీర్చిదిద్దారు. మొదటి రోజు స్వామివారి కల్యాణం, విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేయనున్నారు. ఆదివారం ఉదయం సముద్ర స్నానాలు జరుగనున్నాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. తీర ప్రాంతంలో జరిగే తొలి తిరునాళ్ల కావడంతో ఏటా అధిక సంఖ్యలో ప్రజలు తరలి వస్తుంటారు. తిరునాళ్లను తిలకించిన భక్తులు సముద్ర స్నానాలు ఆచరిస్తారు.

5న సినీ సంగీత విభావరి

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై శ్రీ సాయిరాగ సంగీత కళాశాల ద్వితీయ వార్షికోత్సవం పురస్కరించుకుని సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మునిపల్లె రమణి ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే విభావరిలో గాయకులు సినీ పాటలను ఆలపిస్తారని, సంగీతాభిమానులు పాల్గొనాలని కోరారు.

కేంద్ర బడ్జెట్‌తో రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనం లేదు



రెవెన్యూ అధికారిణి శ్రీదేవికి వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్‌పార్టీ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న జల్లి భాగ్య శ్రీధర్, సంఘ నాయకుడు

బాపట్ల అర్బన్: కేంద్ర బడ్జెట్‌తో రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీ నాయకులు పేర్కొన్నారు. బాపట్ల జిల్లా అధ్యక్షుడు గంట అంజిబాబు ఆదేశాల మేరకు ఆ పార్టీ పట్టణ కమిటీ నాయకులు శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2023 బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు గురించి ఎలాంటి ప్రస్తావన చేయకపోవడం దురదృష్టకరమన్నారు. మోదీ, అమిత్‌షా, మంత్రి నిర్మలా సీతారామన్‌లు దేశ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేస్తున్నారని ఆరోపించారు. ప్రధాని మోదీ, మంత్రి అమిత్‌షాల దత్త పుత్రుడు అదానికి వేల కోట్లు బ్యాంకు రుణాలు ఇప్పించి, రైతులకు ఎలాంటి రుణాలు ఇవ్వకుండా నష్టాలపాలు చేస్తున్నారన్నారు. ఆదానిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రెవెన్యూ అధికారిణి కె.శ్రీదేవికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ అధ్యక్షుడు పఠాన్ రాజేష్, పట్టణ మహిళా అధ్యక్షురాలు దండు రేణుక, బీసీ సెల్ నాయకుడు నక్కల రాంబాబు, ఎస్సీ సెల్ టౌన్ ప్రెసిడెంట్ ఇస్సాకు, జిల్లా సెక్రటరీ సాగర్, కట్ట లాజర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్యాయం చేసే బడ్జెట్

బాపట్ల అర్బన్: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ 2023–24 సంవత్సర బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకంపై భారీ కోత విధించారని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జల్లి భాగ్య శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో కేవలం రూ. 60 వేల కోట్లు కేటాయించడం గ్రామీణ పేదలను, కష్ట జీవులను తీవ్రంగా నష్టపరిచిందన్నారు. 2020–2021 బడ్జెట్లో రూ.98 వేల కోట్లు కేటాయించిన కేంద్రం 2022– 2023 బడ్జెట్లో రూ.73 వేల కోట్లు కేటాయించిందని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం అన్ని విధాల అన్యాయం చేసిందన్నారు.

విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు పంపిణీ



పేరలి(కర్లపాలెం): విద్యార్థులు దాతల సహకారాన్ని వినియోగించుకోవాలని ఎంపీడీవో ఎ.ఎలీషాబాబు పేర్కొన్నారు. ఎంపీపీ యారం వనజ ఆధ్వర్యంలో దాతల సహకారంతో పేరలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు 200 స్టీల్ ప్లేట్లు ఆయన శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పేరలి గ్రామ సర్పంచ్ మల్లెల వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జ్ హెచ్ఎం పుష్పేందర్‌రెడ్డి, నాయకులు మందపాటి పరమానందకుమార్, పేరాల వెంకట సురేష్, కార్యదర్శి సువర్చల తదితరులు పాల్గొన్నారు.

6న అంగన్‌వాడీల ధర్నా

రేపల్లె: అంగన్వాడీ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 6న బాపట్ల కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు కె.ఝాన్సీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధర్నాలో అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్‌లు అధిక సంఖ్యలో పాల్గొని, విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

వృద్ధురాలికి బియ్యం అందజేత

కర్లపాలెం: పేదరికంలో ఉన్న ముస్లింలకు అల్లా దయతో చేయూతనందిస్తున్నామని కర్లపాలెం ఉప సర్పంచ్ పఠాన్ అహ్మద్ తెలిపారు. శుక్రవారం కర్లపాలెంలోని పేద వృద్ధురాలికి ముస్లిం పెద్దల ఆధ్వర్యంలో 10 కేజీల బియ్యం అందజేశారు. పఠాన్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం పెద్దల ఆధ్వర్యంలో పేదలకు చేయూతనందిస్తామని తెలిపారు.

మహిళలకు రుణాలు



నగదు చెక్కులు అందజేసిన ఎంపీపీ

వేమూరు: శ్రీనిధితో మహిళలు వ్యాపారాలు చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎంపీపీ యల్లమాటి మోహన్ పేర్కొన్నారు. వేమూరు గ్రామానికి చెందిన ఫిష్ ఆంధ్ర లబ్ధిదారులు సుజాత, వెంకటేశ్వరమ్మకు శ్రీనిధి కింద లక్ష రూపాయలు, రూ.50 వేలు రుణాలు మంజూరయ్యాయి. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నగదు చెక్కులను ఎంపీపీ మోహన్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైఎస్సార్ ఇందిర క్రాంతి పథం ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాటనికి రుణాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సునీత, ఏపీఎం రాము, సీసీలు బుల్లిబాబు, యానిమేటర్లు పాల్గొన్నారు.

నదీ భూ వివాదంలో నిందితుల అరెస్టు

కొల్లూరు: నదీ తీరంలోని ఇసుక మేటల ఆక్రమణ విషయంలో చోటుచేసుకున్న ఘర్షణలో ఇరువర్గాల వ్యక్తులను పోలీసులు శుక్రవారం రాత్రి అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని అరవింద వారధి వెంబడి నదిలో ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించుకునేందుకు పెదలంక, చింతర్లంక గ్రామాలకు చెందిన కొంతమంది సీపీఎం, కౌలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో యత్నించారు. వారి ఆక్రమణలను నదీ తీరం వెంబడి పొలాల రైతులు అడ్డుకున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. వివాదంలో చింతర్లంకకు చెందిన మగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి.

ఈ ఘటనపై ఎస్సీ వర్గీయులు చేసిన ఫిర్యాదు మేరకు 9 మందిపై ప్రాథమికంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, శుక్రవారం డీఎస్పీ టి.మురళీకృష్ణ విచారణ చేపట్టారు. విచారణ అనంతరం ఎస్సీ, ఎస్టీ కేసులో నిందితులకు 41 నోటీసులు అందజేసేందుకు సిద్ధమయ్యారు. పోలీసు స్టేషన్ వద్ద నాటకీయ పరిణామాలు పోలీసు యంత్రాంగం నిందితులైన వెలివల బసవరత్తయ్య, ఉప్పు నాంచారయ్య, ఉప్పు నాగసురేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన వారిని అరెస్టు చేసేందుకు గాలిస్తున్నారు. మరో వైపు ఆర్‌సీ (రివర్ అండ్ కన్జర్వేషన్) భూముల్లోకి దళితులను తీసుకుని వెళ్లి ఆక్రమించుకునేందుకు యత్నించడం, చెట్లను నరికి తగలబెట్టడం వంటి చర్యలకు పాల్పడిన కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తోడేటి సురేషును కూడా పోలీసుల అరెస్టు చేశారు. కేసులు నమోదైన మిగతా నిందితులను కూడా అరెస్టు చేసి, కోర్టుకు హాజరుపర్చనున్నట్లు డీఎస్పీ టి.మురళీకృష్ణ తెలిపారు.

నేటి నుంచి శ్రీ తాళ్ళమ్మ, వీరమ్మ, పేరంటాల తిరునాళ్లు



నగరం: మండలంలోని ధూళిపూడి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతాళ్ళమ్మ, వీరమ్మ, పేరంటాల తిరునాళ్ల మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం నుంచి రెండు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు ఆలయ కమిటీ సభ్యులు సర్వం సిద్ధం చేశారు. ధూళిపూడి పరిధిలోని 18 గ్రామాలకు ఇలవేల్పు అయిన శ్రీ తాళ్ళమ్మ అమ్మవారి తిరునాళ్లను ఏటా మాఘ మాసంలో పౌర్ణమి రోజున అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఈ నెల 4, 5 తేదీల్లో ఉత్సవాలు జరిపేందుకు ఆలయ కమిటీ నిశ్చయించింది. 4న అమ్మవారికి నైవేద్యాల సమర్పణ, 5న శిడి మానోత్సవం జరిపేందుకు సన్నాహాలు పూర్తిచేశారు. తిరునాళ్లను పురస్కరించుకుని ఆలయప్రాంగణంలో చలువ పందిళ్లు వేశారు. విద్యుత్ దీపాల అలంకరణతో సుందరంగా తీర్చిదిద్దారు.

కుక్కలున్నాయి.. జాగ్రత్త



పట్టణంలో రాత్రి గుంపులుగా రోడ్డుపై శునకాలు

బాపట్ల అర్బన్ : పట్టణంలో కుక్కలు బెడద ఎక్కువగా ఉంది. వార్డుల్లో శునకాలు గుంపులుగా తిరుగుతూ వృద్ధులు, చిన్నారులపై దాడులు చేస్తున్నాయి. దీంతో పట్టణవాసులు భయాందోళన చెందుతున్నారు. వీధి కుక్కలు దాడులు చేయడంతో పిల్లలు, పెద్దలు ఒంటరిగా ఇంటి నుంచి బయటకు వెళ్లేందుకు భయపడుతున్నారు. కొన్ని పిచ్చికుక్కలు కూడా ఉండటంతో మరింత ఆందోళన చెందుతున్నారు. మున్సిపాలిటీ అధికారులకు పట్టణ ప్రజలు పలు మార్లు ఈ సమస్యపై ఫిర్యాదు చేశారు. కానీ, నామ మాత్రం గానే చర్యలు తీసుకుంటున్నారని స్థానికులు వాపోతున్నారు. కుక్కలకు సంతతి నియంత్రణ ఆపరేషన్ చేయిస్తామని గత పది సంవత్సరాల నుంచి ప్రచారం జరుగుతున్నా.. ఆచరణలోకి మాత్రం రావడం లేదు.

సమస్యను పరిష్కరిస్తాం..

పట్టణంలోని కుక్కలు బెడద మా దృష్టికి వచ్చింది. వాటి సంతతి నియంత్రణ ఆపరేషన్‌కు పశు సంవర్ధక శాఖ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటాం. సమస్యను పరిష్కరిస్తాం.

– ఎ.భానుప్రతాప్, కమిషనర్, బాపట్ల మున్సిపాలిటీ

మరో ఇద్దరు లిక్విడ్ గంజాయి విక్రేతల అరెస్టు

నగరంపాలెం: లిక్విడ్ గంజాయి విక్రయం కేసులో మరో ఇద్దరు యువకుల్ని అరెస్ట్ చేసినట్లు ఎస్ఈబీ గుంటూరు–2 స్టేషన్ సీఐ ఎం.రమేష్ శుక్రవారం తెలిపారు. ఎస్ఈబీ గుంటూరు–2, డీఎస్ఈఓ బృంద పోలీసులు బుధవారం గుంటూరు క్లబ్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమయంలో బేల్దారి మేస్త్రీ జె.వెంకటేశ్వర్లును అదే రోజు అరెస్ట్ చేసి, రూ.1.40 లక్షల విలువైన లిక్విడ్ గంజాయి, మోటారు సైకిల్‌ను సీజ్ చేశారని చెప్పారు. ఆ రోజు పరారైన మారుతీనగర్‌కు చెందిన తాజుద్దీన్‌ను గురువారం అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ క్రమంలో అతనితోపాటు అదే ప్రాంతానికి చెందిన శివప్రసాద్‌ను అరెస్ట్ చేశామని సీఐ తెలిపారు. ఇంటర్ వరకు చదివి, చెడు వ్యసనాలకు బానిసగా మారి దురాశతో లిక్విడ్ గంజాయి విక్రయిస్తున్నట్లు ఆయన చెప్పారు.

ఏఎస్ఎన్ ఫార్మసీ యూత్ రెడ్‌క్రాస్‌కు పురస్కారం



యూత్ రెడ్‌క్రాస్ సభ్యులతో ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: స్థానిక అన్నాబత్తుని సత్యనారాయణ ఫార్మసీ కాలేజి యూత్ రెడ్‌క్రాస్ విభాగానికి తెలంగాణ మేధావుల ఫోరం బెస్ట్ యూత్ రెడ్‌క్రాస్ అవార్డును ప్రదానం చేసింది. హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన స్వామి వివేకానంద 160వ జయంత్యుత్సవాల్లో ముగింపు రోజున ఏఎస్ఎన్ ఫార్మసీ యూత్ రెడ్‌క్రాస్ విద్యార్థుల సేవను అభినందిస్తూ బెస్ట్ యూత్ రెడ్‌క్రాస్ అవార్డును ఆ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ జి.చంద్రయ్య చేతులమీదుగా బహూకరించింది. కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణకు నేషనల్ యూనిటీ అవార్డును అందజేసి సత్కరించారు. రెడ్‌క్రాస్ సొసైటీ, తెనాలి చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి కూడా వీరితో ఉన్నారు. శుక్రవారం కాలేజిలో ఏఎస్ఎన్ విద్యా సంస్థల చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణను, యూత్ రెడ్‌క్రాస్ సభ్యులు ధనుంజయ్, సాయినితిన్, లక్ష్మణ్,నాగార్జునరెడ్డి, సుమలత, దివ్య, యూత్ రెడ్‌క్రాస్ కన్వీనర్ డాక్టర్ టి.లక్ష్మీదుర్గను అభినందించారు.

అజాగ్రత్త.. తప్పదు అస్వస్థత

పురుగు మందు పిచికారీలో జాగ్రత్తలు తప్పనిసరి



పిట్టలవానిపాలెం: పురుగు మందులు పిచికారి సమయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా.. అస్వస్థతకు గురయ్యే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. తగు జాగ్రత్తలు పాటిస్తూ..మందులు పిచికారి చేసుకోవాలని బాపట్ల ఏడీఏ లక్ష్మి తెలిపారు. ప్రస్తుతం రైతులు వేరుశనగ, మినుము సాగు చేస్తున్నారు. మందులు పిచికారి చేసే సమయంలో అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని చెప్పారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- పురుగు మందు డబ్బాను నోటితో తీయకూడదు. మందులు చేతితో కలపకూడదు.
- పవర్ స్ప్రేయర్ నాజిల్‌ను పెద్దగా చేయకూడదు. మందు సన్నగా తుంపర్లుగా పడేలా చూడాలి.
- ఒకేసారి రెండు, మూడు మందులను కలిపి పిచికారి చేయకూడదు.
- నిండుగా దుస్తులు, చేతులకు గ్లౌజులు, కళ్ల జోడు, ముఖానికి మాస్కు, తలకు టోపీ లేక రుమాలు ధరించాలి.
- ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే మందు స్ప్రే చేయాలి.
- ఎదురు గాలికి మందు పిచికారి చేయకూడదు.
- పురుగు మందు స్ప్రే చేయడం పూర్తయ్యే వరకు భోజనం చేయడం, పొగతాగడం వంటి చేయకూడదు.
- గాయాలు, పుండ్లు ఉన్న వ్యక్తులు పురుగు మందు పిచికారి చేయకూడదు.

మందు ప్రభావానికి గురైతే..

- పురుగు మందు ప్రభావానికి గురైన వ్యక్తి నోట్లో వేలు పెట్టి వాంతి చేయించాలి.
- మూర్ఛబోయిన సందర్భంలో నాలుక కరుచుకోకుండా రెండు దవడల మధ్య గుడ్డ పెట్టాలి.
- శరీర ఉష్ణోగ్రతను తగ్గించేందుకు తడి బట్టతో తుడవాలి.
- ఉష్ణోగ్రత తగ్గితే దుప్పటి కప్పి వెచ్చగా ఉంచాలి.
- వెంటనే సమీపంలో ఉన్న ఆసుపత్రికి బాధితుడిని తరలించాలి.

లైంగిక దాడి కేసులో నిందితుడి అరెస్ట్

తెనాలిరూరల్: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన ఓ బాలిక ఇంటర్‌చదువుతోంది. ఆమె అక్క బీటెక్ రెండో సంవత్సరం చదువుతోంది. ఈమెతో కలిసి చదువుతున్న కోటప్పకొండకు చెందిన 18 ఏళ్ల సాయి వెంకటలక్ష్మీనారాయణ బాలికతో పరిచయం పెంచుకున్నాడు. ఆమెకు మాయమాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక, కుటుంబ సభ్యులు ఇటీవల పోలీసులను ఆశ్రయించగా, కేసు నమోదు చేసిన త్రీ టౌన్ సీఐ యు. శ్రీనివాసులు నిందితుడిని శుక్రవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.